
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

శుక్రవారం 11 ఏప్రిల్ 2025

ఇసుక అక్రమాలపై విచారణాధికారి నియామకం

శ్రీకాకుళం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బీచ్ ఇసుక రవాణాలో అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. గార మండలం వత్సవలసలో ట్రైమెక్స్ కంపెనీకి 387.72ఎకరాల్లో బీచ్ ఇసుక ఖనిజాల రవాణా కోసం అనుమతించి అక్రమాలకు పాల్పడినట్లు అప్పటి జిల్లా గనుల భూగర్భ వనరుల సహాయ సంచాలకుడు కేఎల్‌వీ ప్రసాద్, అసిస్టెంట్ జియాల జిస్ట్ తమ్మినాయుడుపై విచారణ జరుగుతోంది. ఈ నివేదిక ఆధారంగా కేసును ప్రభుత్వానికి సమర్పించే (ప్రజెంటింగ్) అధికారిగా శ్రీకాకుళం గనుల శాఖ డీడీ సి.మోహనరావును, విచారణాధికారిగా గనుల భూగర్భ వనరులశాఖ జేడీ డి.శ్రీనివాసరావును నియమించారు. ఈమేరకు ప్రభుత్వ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులను జారీచేశారు.



నడసంద్ర గ్రామం

కన్నీటి సంద్రం!



- నడసంద్ర గ్రామాన్ని కబళిస్తున్న క్యాన్సర్
- నాలుగేళ్లలో ఆరుగురి మృతి
- ప్రస్తుతం మరో పది మంది వరకు బాధితులు



నడసంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయం



మెళియాపుట్టి మండలం నడసంద్ర గ్రామానికి చెందిన సంధ్యా జిన్నా గత నెల 16 క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందింది. చివరి స్టేజ్‌లో గుర్తించడం వల్ల వైద్యసేవలు అందించినా ఫలితం లేక పోయిందని ఆమె భర్త వరికి జిన్నా ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తమ గ్రామానికి చెందిన చింతామణి మజ్జి కూడా గతేడాది క్యాన్సర్‌తో పోరాడి మృతి చెందిందని తెలిపాడు. గ్రామంలో క్యాన్సర్ వ్యాధిగ్రస్థులు పెరుగుతున్నారని, బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నాడు.

మెళియాపుట్టి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):

ఒడిశా రాష్ట్ర సరిహద్దున.. మెళియాపుట్టి మండలంలోని నడసంద్రలో 150 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో అధికంగా ఒడియా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఏమి జరిగిందో కానీ.. గత నాలుగేళ్ల నుంచీ ఈ గ్రామంలో క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు. ఏ ఇంటికి వెళ్లినా కన్నీటి గాథలే కనిపిస్తున్నాయి. గత నాలుగేళ్లలో క్యాన్సర్ వ్యాధితో గ్రామానికి చెందిన చింతామణి మజ్జి, రోహిత్‌పాత్రో, సంధ్యా జిన్నా, ప్రతాప్‌పాత్రో, జొగ్గ జిన్నా, బొబ్బుకుంటి.. ఇలా ఆరుగురు మృతి చెందారు. ప్రస్తుతం మరో 10 మంది వరకూ క్యాన్సర్‌తో బాధపడుతుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో చాలా మందికి ఖైనీ, గుట్కా, బీడీ, సిగరెట్, కిల్లీ అలవాటు ఉంది. వీటి కారణంగా వ్యాధి ప్రబలిందా?.. లేదా నీటి సమస్య వల్ల వ్యాధి తీవ్రత పెరుగుతుందో తెలియక సతమతమవుతున్నారు. వైద్యసిబ్బంది అవగాహన కల్పిస్తున్నా.. వ్యాధి తీవ్రత తగ్గడం లేదని ఆవేదన చెందుతున్నారు. గతంలో ఈ పరిస్థితి లేదని, రెండేళ్ల నుంచి కొత్తబోరు తవ్వి నీరు ఇవ్వడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కొత్తబోరు నీటిని నిల్వ ఉంచితే మరుసటి రోజుకు నల్లగా మారుతోందని, ద్విచక్రవాహనాలను ఆ నీటితో కడిగితే తుప్పు పడుతున్నాయని తెలిపారు. తాగునీటిని పరీక్షించాలని సచివాలయ సిబ్బందికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన తాము వైద్యసేవలు పొందేం దుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందు తున్నారు. ఆరోగ్యశ్రీ సేవలు కూడా కొంత మందికి వర్తించకపోవడంతో వైద్యం కోసం అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి క్యాన్సర్ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై మెళియాపుట్టి వైద్యాధికారిణి గ్రీష్మ వద్ద ప్రస్తావించగా.. 'గతంలో క్యాన్సర్ వ్యాధితో నలుగురు బాధపడుతుండేవారు. ముగ్గురికి వ్యాధి నయమైంది. ఇటీవల ఒకరు మృతి చెందారు. ఏ అనారోగ్య సమస్య ఉన్నా క్యాన్సర్ అంటూ ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదు. క్యాన్సర్ బాధితులు భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. సకాలంలో క్యాన్సర్‌ను గుర్తిస్తే.. దాని నివారణకు చర్యలు చేపడతామ'ని తెలిపారు. అలాగే గ్రామంలో తాగునీటి పరీక్షలు చేయిస్తామని, ఇప్పటికే క్యాన్సర్ బాధితులను గుర్తిం చాలని వైద్యసిబ్బందిని ఆదేశించామని ఎంపీడీవో ప్రసాద్‌పండా తెలిపారు. గ్రామంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.



మూడేళ్ల నుంచి బాధపడుతున్నాను

గత మూడేళ్ల నుంచి నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్నాను. వైద్యం కోసం అప్పు చేశాను. ప్రభుత్వం నుంచి ఎటువంటి సేవలు అందడం లేదు.

-వినోద్ మల్లికో, నడసంద్ర, మెళియాపుట్టి

బాధితులు పెరుగుతున్నారు



గ్రామంలో క్యాన్సర్ వ్యాధి బాధితులు పెరుగుతుండడంతో భయాందోళనగా ఉంది. ఇప్పటికే కొంతమంది బాధితులను విశాఖలో వైద్యసేవలు పొందుతున్నారు. చాలామంది పేదలకు వ్యాధి ప్రబలుతుండడంతో వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు.

- సంతోష్ మల్లికో, మాజీ సర్పంచ్, నడసంద్ర

వైద్య పరీక్షలు నిర్వహించాలి



గ్రామంలో క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి వైద్యపరీక్షలు చేయించాలి. కొంతమంది బాధితులు చివరిస్టేజ్‌లో వైద్యసేవల కోసం వెళ్లినా ప్రయోజనం ఉండడం లేదు. ప్రత్యేక వైద్యనిపుణులతో గ్రామంలో పరీక్షలు నిర్వహిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- వెంకటరావు, మాజీ సర్పంచ్, నడసంద్ర



మొఖలింగాపురంలో పర్యటిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అభివృద్ధి పనుల్లో జాప్యమెందుకు?

- 'పట్టుమహాదేవి కోనేరు' తాత్సారంపై కలెక్టర్ ఆగ్రహం
- గిరిజన గూడల్లో పర్యటన.. సమస్యలపై ఆరా
- చిన్నకేదారి రిజర్వాయర్‌ను నిర్మించాలని రైతుల విజ్ఞప్తి

టెక్కలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధి పనుల్లో తాత్సారం ఎందుకు చేస్తున్నారంటూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం టెక్కలిలోని మొఖలింగాపురం పంచాయతీలో గడిమెట్ట జగన్నాథపురం, మొఖలింగాపురం తదితర గిరిజన గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. పట్టుమహా టదేవి కోనేరు అభివృద్ధి పనుల్లో జాప్యంపై మండల ఇంజనీరింగ్ అధికారి లక్ష్మంనాయుడు, పంచాయతీ ఈవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు ఎందుకు చేపట్టడం లేదని వారిని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దని హెచ్చరించారు. పనులు (మిగతా 6వ పేజీలో..)



- మడపాం టోల్‌ప్లాజా వద్ద హోటళ్లు, దాబాల్లో పాచిన పదార్థాలనే వేడి చేసి విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నాన్‌వెజ్ అయితే ఫ్రిజ్‌లో రోజుల తరబడి నిల్వ చేసి.. తర్వాత వాటికి రంగులు కలిపి వేడిచేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇక్కడ తింటే.. జబ్బులు గ్యారంటీ!

- నరసన్నపేటలోని ఒక పెట్రోల్ బంక్ సమీపాన హోటల్‌లో కొన్నాళ్ల కిందట ఓ వ్యక్తి ఇడ్లీ తింటుండగా.. ప్లేట్‌లో బొద్దింక కనిపించింది. దీనిపై అప్పట్లో వినియోగదారులు ప్రశ్నించగా.. హోటల్ వ్యాపారి బుకాయించాడు. ఇటీవల అదే హోటల్‌లో ఉడకని కూరలు, చట్నీలతో టిఫిన్ విక్రయిస్తున్నారని విశ్రాంత ఉపాధ్యాయుడు ముద్దాడ గోపాలరావు సామాజిక మాధ్యమాల్లో మొరపెట్టుకున్నా.. కనీసం అటువైపు అధికారులు చూడడం లేదు.

- నరసన్నపేటలోని శివాలయం సమీపంలో డ్రైనేజీపై ఒక పాస్ట్‌ఫుడ్ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ హోటల్‌లో చైనా సాల్ట్, వివిధ వస్తువులకు కలర్లు వాడుతూ.. సూప్‌లు రుచిగా వచ్చేందుకు ఏదో పొడి కలుపుతున్నారనే ప్రచారం సాగుతోంది. వీటిపై ఆహారకల్తీ నియంత్రణ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

- పాచిపోయిన పదార్థాలే అధిక ధరకు విక్రయం
- హోటళ్లు, దాబాల్లో కానరాని నిబంధనలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- అప్పుడప్పుడూ నామమాత్రపు తనిఖీలు

నరసన్నపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పాచిపోయిన ఆహార పదార్థాలను వేడి చేసి విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో ఎక్కడికక్కడ హోటళ్లు, దాబాలు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లు వెలిశాయి. నరసన్నపేటలోనే చిన్న, పెద్ద హోటళ్లు, దాబాలు సుమారు 68 ఉన్నాయి. వీటిలోని చాలా హోటళ్లలో పాచిపోయిన చెట్నీలకు తాళింపు వేసి వినియోగదారులకు విక్రయిస్తున్నారు. దాబాల్లో అయితే రెండు వారాల కిందట నిల్వ ఉంచిన పదార్థాలను వేడి చేసి.. వాటిని విక్రయిస్తూ దోచుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి. సాంబారు, రసం, వేపుడు కూరలను నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే తయారు చేస్తున్నారు. మాంసాహారం పదార్థాలపై కలర్ వేసి.. వేడి చేసి (మిగతా 6వ పేజీలో..)

ఉత్తర్వులిచ్చి.. ఆ వెంటనే వెనక్కి..

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నియామకంలో మార్పులు
- ముందు డాక్టర్ సుజాతకు..
- తర్వాత డా.అనితకు..

అరసవల్లి/ శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నియామకంలో ఒక్కరోజులోనే మార్పులు చోటుచేసుకున్నాయి. గత డీఎంహెచ్‌వో డా.టీవీ.బాలమురళీకృష్ణ ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డీఎంహెచ్‌వోగా డాక్టర్ బి.సుజాత పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(విజయవాడ) నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. డాక్టర్ సుజాత ప్రస్తుతం విశాఖపట్నంలోని రీజనల్ ట్రైనింగ్ స్కూల్ (ఫిమేల్) ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. గతంలో ఈమె శ్రీకాకుళం జిల్లా పాతర్లపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారిగా కూడా పనిచేశారు. కాగా.. ఆమె బాధ్యతలు తీసుకోక ముందే.. గురువారం అనూహ్యంగా శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్) సీఎస్ ఆర్ఎంవోగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.అనితను డీఎంహెచ్‌వోగా నియమించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ బండారు సుబ్రహ్మణ్యేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డీఎంహెచ్‌వోగా సుజాతను కాకుండా అనితను ఖరారు చేసినట్టయింది.

కౌలు రైతు ఆత్మహత్య

- అప్పులు అధికమై.. బతుకు భారమై..
- పురుగుల మందు తాగి బలవన్మరణం



నర్సింహమూర్తి (ఫైల్)

కంచిలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కంచిలి మండలం పెద్దకొజ్జిరీయ గ్రామానికి చెందిన కౌలురైతు బల్లెడ నర్సింహమూర్తి(58) బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులబాధ తాళలేక గ్రామ సమీపంలోని జీడితోటలో పురుగుల మందు తాగి ప్రాణాలు కోల్పోయాడు. ఇందుకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దకొజ్జిరీయకు చెందిన నర్సింహమూర్తి తనకు ఉన్న ఎకరా పొలంతోపాటు ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. జీడి, మామిడి, కొబ్బరి, వరి పండిస్తున్నారు. నాలుగేళ్లుగా సరైన దిగుబడులు లేక తీవ్ర నష్టాలు వచ్చాయి. ఏటా సాగు పెట్టుబడి కోసం రూ.లక్షల్లో అప్పు చేసిన నర్సింహమూర్తి.. సరైన దిగుబడి లేక వాటిని తీర్చలేకపోయారు. ఈ క్రమంలో వడ్డీలు అధికమై సుమారు రూ.15లక్షల మేర అప్పు పెరిగిపోయింది. దీంతో అధిక ఒత్తిడికి లోనై.. అప్పుల బాధ తాళలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. బుధవారం ఉదయం 10గంటల సమయంలో తోటకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పిన నర్సింహమూర్తి రాత్రి 6 గంటలైనా ఇంటికి రాలేదు. దీంతో భార్య నీలవేణి, కుమారులు శ్రీను, ప్రవీణ్ ఆందోళన చెందారు. స్థానికులతో కలిసి నర్సింహమూర్తి ఆచూకీ కోసం వెతికారు. రాత్రి 10.30 గంటల సమయంలో గ్రామసమీపంలోని జీడితోటలో నర్సింహమూర్తి విగతజీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహం పక్కనే పురుగుల మందు డబ్బా కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ పి.పారినాయుడు ఘటన స్థలానికి చేరుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సోంపేట ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నీలవేణి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా నర్సింహమూర్తి కుమారులిద్దరికీ వివాహమై.. పిల్లలు ఉన్నారు. స్థానికంగా ఉపాధి లేక వీరిద్దరూ మహారాష్ట్ర, గుజరాత్‌కు వలస పోయేవారు. ఇటీవల వారు కూడా స్వగ్రామానికి చేరుకుని తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయం చేసేవారు. ఇంతలోనే తమ తండ్రి ఆత్మహత్య చేసుకోవడంతో విషాదంలో మునిగిపోయారు. నర్సింహమూర్తి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పల్లె నుంచి పట్నానికి..!

- కూటి కోసం 20-30 కిలోమీటర్ల దూరం వచ్చి..
- పని దొరికిన రోజు ఆనందం.. లేకుంటే ఇంటికే..
- గ్రామాల్లో కొందరికే ఉపాధిహామీ పనులు







పల్లెల నుంచి వాహనాల్లో శ్రీకాకుళం చేరుకుంటున్న కూలీలు

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల గడిచినా సామాన్యుల జీవన విధానంలో మార్పు రావడం లేదు. పొట్ట కూటి కోసం పల్లె నుంచి పట్టణానికి వెళ్లి.. ప్రమాదాల అంచున వాహనాల్లో ప్రయాణిస్తూ.. పనులు చేస్తున్నా.. కూలీల తలరాతలు మారడం లేదు. అందరికీ పని కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం కొందరికే పరిమితమవుతోంది. దీంతో పల్లెల్లో చాలామంది పనుల కోసం ఎదురుచూస్తూ పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. రోజూ కూలిపని కోసం శ్రీకాకుళం చుట్టు పక్కల మండలాల నుంచి జిల్లా కేంద్రానికి వేల సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. సుమారు 20 నుంచి 30 కిలోమీటర్ల మేర ఆటోల్లో ప్రమాదకరమైన ప్రయాణాలు చేస్తూ.. వ్యయప్రయాస పడి శ్రీకాకుళం చేరుకుంటున్నారు. గృహ నిర్మాణ పనుల కోసం శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండ్ ప్రాంతాల వద్ద రోజు కూలీలు గంటల తరబడి ఎదురు చూస్తుంటారు. అదృష్టం బాగుంటే పని దొరుకుతుంది. లేదంటే ఆ రోజు తమకు పస్తులేనని కూలీలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లోనే పూర్తిస్థాయిలో ఉపాధి పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పల్లెల్లో పనులు దొరకడం లేదు..



లావేరు మండలం కేశవరాయునిపాలెంలో ఉపాధి హామీ పనులు లేవు. మా తండ్రి రోజు కూలీ. ఆయనతో పాటు నేను 20 ఏళ్లుగా కూలి పనులు చేస్తున్నాం. నా భర్త కొన్నాళ్ల కిందట చనిపోగా.. వితంతు పింఛన్ కూడా నాకు అందడం లేదు. ఇద్దరు పిల్లలను పోషించేందుకు పనుల కోసం రోజూ శ్రీకాకుళం వస్తున్నాను. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో పనులు కల్పించాలి.

-నిమ్మ ధనలక్ష్మి, కేశవరాయునిపాలెం

బతుకు మారడం లేదు..



లావేరు మండలం మరపాకలో ఉపాధి పనులు చేపట్టడం లేదు. దీంతో కూలి పనుల కోసం శ్రీకాకుళం వస్తున్నాం. పని ఉంటేనే వేతనం. లేదంటే చార్జీలకు కూడా డబ్బులు లేని దుస్థితి. 20ఏళ్లుగా కూలి పనులు చేస్తున్నా.. మా బతుకులు మాత్రం మారడం లేదు.

-వడ్డి లక్ష్మి, మురపాక

ఉపాధి కొందరికే..



పొందూరు మండలం పులాజీపేటలో ఉపాధిహామీ పనులు కొందరికే లభిస్తున్నాయి. దీంతో కూలి కోసం రోజుకి రూ.100 ఆటోచార్జీలు కట్టుకుని శ్రీకాకుళం వెళ్తున్నాం. నెలలో 15 రోజులు మాత్రమే పని లభిస్తోంది. ఆ వచ్చిన అరకొర కూలి డబ్బులతో జీవితం నెట్టుకొస్తున్నాం.

-కిల్లాన అప్పన్న, పులాజీపేట

బీసీ స్టడీ సర్కిల్.. సౌకర్యాలు నిల్


ప్రారంభానికి సిద్ధమైన బీసీ భవన్

- నిరుపేద బీసీ యువతకు ఆసరా ఏదీ?
- పాత పుస్తకాలతోనే పరీక్షలకు సిద్ధమవ్వాలట
- మంత్రి అచ్చెన్న చొరవ తీసుకోవాలని వినతి

అరసవల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేద బీసీ విద్యార్థులు, నిరుద్యోగ యువత తమ కలలను సాకారం చేసుకోవడానికి.. ప్రభుత్వోద్యోగాలు సాధించి... ఉన్నత స్థానాలకు ఎదగడానికి దోహదం చేసేది బీసీ స్టడీ సర్కిల్. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా, నిరుపేద, సామాన్య ఉద్యోగార్థుల కోసం, ప్రైవేటు సంస్థలలో కోచింగ్ తీసుకునే స్థోమత లేని వారి కోసం ఏర్పాటు చేసిన ఆశల నిలయం. ఆ కలల సౌధంలో అడుగడుగునా సమస్యల ప్రశ్నలే. కనీస అవసరాలకు కూడా గతిలేని పరిస్థితులే. పాత సిలబస్... పాత మెటీరియల్‌తోనే ఘన విజయం సాధించాలని విద్యార్థులకు మార్గదర్శనం చేసేలా ఉంది.

● సౌకర్యాలు లేక..

నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయం వెనుక గల బీసీ స్టడీ సర్కిల్ తాత్కాలిక భవనంలో నడుస్తోంది. నిత్యం నిరుపేద బీసీ విద్యార్థులు ఇక్కడకు అన్ని రకాల పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ కోసం... స్టడీ సర్కిల్ లైబ్రరీలో చదువుకునేందుకు వస్తుంటారు. దూరప్రాంతాల నుంచి కూడా ఎక్కువగా మహిళా అభ్యర్థులు ఇక్కడకు వచ్చి రోజంతా రీడింగ్ రూంలో కూర్చుని చదువుకుంటున్నారు. కానీ ఇక్కడ కనీస సౌకర్యాలు కూడా లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

● పాత పుస్తకాలతో ఎలా?

స్టడీ సర్కిల్‌లో ఉద్యోగార్థుల ప్రిపరేషన్ కోసం మారుతున్న సిలబస్‌కు అనుగుణంగా పుస్తకాలను, స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలి. కానీ ఇక్కడ అటువంటి దాఖలాలు కనబడడం లేదు. పాత పుస్తకాలతోనే కుస్తీలు పడుతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలను అందుబాటులోకి తెస్తే విద్యార్థులు మరింత ఉత్సాహంతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అవకాశం ఉంది. ఇలా పాత పుస్తకాలతో పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలని విద్యార్థులు వాపోతున్నారు. కొత్త పుస్తకాలు కొనుక్కునే స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మెథడాలజీ బోధకులేరీ?

స్టడీ సర్కిల్‌లో ఎక్కువ మంది ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్షలకు సంబంధించి శిక్షణ పొందుతున్నారు. డీఎస్సీలో విజయం సాధించాలంటే మెథడాలజీలో మంచి స్కోరు సాధించాల్సిందే. కానీ ఇక్కడ డీఎస్సీ కోచింగ్ పూర్తయిపోయింది. కానీ ఇంతవరకు మెథడాలజీకి సంబంధించి మాత్రం ఎటువంటి శిక్షణ ఇవ్వలేదు. ప్రైవేటు సంస్థలకు దీటుగా శిక్షణ ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడమే తప్ప, నిజానికి దారుణ పరిస్థితుల్లో విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోంది. పూర్తిస్థాయిలో శిక్షణను అందిస్తే ఇక్కడి విద్యార్థులు విజయాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

● నీటి సౌకర్యమేదీ?

స్టడీ సర్కిల్‌లో బాత్‌రూమ్‌లు ఉన్నాయి. కానీ వాటికి నీటి సదుపాయం మాత్రం లేదు. దూరప్రాంతాల నుంచి నిత్యం బస్సుల్లో ఇక్కడకు వచ్చి, ఉదయం నుంచి సాయంత్రం వరకు చదుకువునే మహిళా అభ్యర్థుల బాధలు వర్ణనాతీతం. కనీస అవసరాలు తీర్చుకోలేక వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

● డిజిటల్ లైబ్రరీకి చోటేదీ?

ప్రస్తుత టెక్నాలజీ యుగంలో విద్యార్థులు పోటీ పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలంటే వారికి డిజిటల్ లైబ్రరీ కచ్చితంగా అందుబాటులో ఉండాల్సిందే. ఇక్కడ డిజిటల్ లైబ్రరీ సదుపాయం ప్రభుత్వం కల్పించ లేదు. క్లాస్‌రూమ్, రీడింగ్ రూమ్ ఒకే గదిలో ఉన్నాయి. లైబ్రరీ, ఆఫీసు ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. డిజిటల్ లైబ్రరీకి కావాల్సిన సామగ్రిని ఉచితంగా అందించేందుకు రోటరీ క్లబ్ ముందుకు వచ్చింది. కానీ కావాల్సిన చోటు అందు బాటులో లేక కార్యరూపం దాల్చలేదు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మంత్రి అచ్చెన్నపైనే ఆశలు

టీడీపీ అధికారంలో ఉన్న పుడు మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు 2019 జనవరిలో బీసీ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ స్టడీ సర్కిల్‌ను నూతనంగా నిర్మించే బీసీ భవన్‌లో ఏర్పాటు చేస్తామని, నిరుపేద బీసీ ఉద్యోగార్థులకు పూర్తిస్థాయి ఉచిత శిక్షణకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని అన్నారు. ఇప్పుడు బీసీ భవన్ నిర్మాణం పూర్తయి, ప్రారంభం కాబోతోంది. ఇందులోకి స్టడీ సర్కిల్‌ను తరలిస్తే, నిరుపేద బీసీ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. కడప, చిత్తూరు జిల్లాల్లో కూడా బీసీ భవన్‌లోనే స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేశారు. మన జిల్లాలో కూడా ఈ మేరకు మంత్రి చొరవ తీసుకుని, బీసీ భవన్‌లో స్టడీ సర్కిల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

● మెగా డీఎస్సీకి 150 దరఖాస్తులు..

రానున్న మెగా డీఎస్సీకి సంబంధించి ఉచిత శిక్షణ కోసం బీసీ స్టడీ సర్కిల్‌కు ఇప్పటికే 150 దరఖాస్తులు వచ్చాయి. నేడు, రేపు కనీసం మరో 50 అయినా వస్తాయి. అంటే సుమారు 200 మంది అభ్యర్థులు డీఎస్సీ కోసం శిక్షణ తీసుకుంటారు. వారు రోజూ లైబ్రరీకి వచ్చి చదువుకునేందుకు ప్రస్తుత సెంటర్‌లో ఎటువంటి సదుపాయాలు లేవు. బీసీ భవన్‌లో స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసి, తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశం ప్రభుత్వం కల్పించాలని ఉద్యోగార్థులు కోరుతున్నారు.


పెచ్చులూడి ప్రమాదకర స్థితిలో ఉన్న ఆఫీసు గది, లైబ్రరీ

కొత్త పుస్తకాలు అందించాలి..



గత ఆరు నెలలుగా బీసీ స్టడీ సర్కిల్‌కు వస్తున్నాను. ఇక్కడ ప్రిపరేషన్ కోసం పాత పుస్తకాలే ఉన్నాయి. సిలబస్ మారినా, అందుకు అనుగుణంగా మెటీరియల్ లేదు. దీంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి. స్వయంగా కొనుక్కుని చదివే స్థోమత లేదు. మాకు పుస్తకాలు అందుబాటులో ఉంటే చాలు. కష్టపడి ఎలాగైనా డీఎస్సీ సాధిస్తాం.

-డి.ఝాన్సీ, డీఎస్సీ అభ్యర్థి

ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలి..



ఇక్కడికి నేను అన్ని రకాల పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి వస్తున్నా. కావలసిన పుస్తకాలు చాలావరకు అందుబాటులో లేవు. పేదరికం కారణంగా కొనుక్కునే పరిస్థితీ లేదు. ఇంటర్‌నెట్ సదుపాయం కల్పిస్తే, ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మేమే నోట్సు రాసుకుని ప్రిపేర్ అవుతాం.

-జె.సునీత

మెథడాలజీ చెప్పనేలేదు..



డీఎస్సీ కోసం ఇక్కడ శిక్షణకు వచ్చాను. మాకు మెథడాలజీలో శిక్షణ పూర్తిగా ఇవ్వనేలేదు. ఏం చేయాలో తెలియడం లేదు. ఇక్కడ ఉన్న పాత పుస్తకాలతోనే కుస్తీలు పడుతున్నాం. విజయం సాధించాలనే మా కలకు సహకారం అవసరం. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేస్తే, వారికి రుణపడి ఉంటాం.

-ఆర్.మంగ, డీఎస్సీ అభ్యర్థి

నేడు జ్యోతిబాపూలే జయంతి

- సిక్కోలులో బీసీ భవన్ ప్రారంభం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నగరంలోని జ్యోతిబాపూలే విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం నగరంలోని 80 అడుగుల రోడ్డులో నూతనంగా నిర్మించిన బీసీ భవన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని అన్నారు.

జాగిలాలతో విస్తృత తనిఖీలు



పొందూరు రైల్వేస్టేషన్‌లో జాగిలంతో తనిఖీ చేస్తున్న దృశ్యం


జి.సిగడాంలో...

శ్రీకాకుళం క్రైం/ పొందూరు/ జి.సిగడాం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ నిల్వలు, రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా గురువారం జి.సిగడాం, పొందూరు, పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసు జాగిలాలతో విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానిత ప్రదేశాలు, రైల్వే స్టేషన్లు, ముఖ్య కూడళ్లు, దుకాణాలు, వాహనాలు తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్లలో అనుమానం ఉన్న ప్రయాణికుల లగేజి బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రెవెన్యూ అధికారులకు కలెక్టర్ సూచన



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల వారీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలపై నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్ల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రీసర్వే, పీజీఆర్ఎస్, పౌర సేవల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మ్యుటేషన్, ఆస్తుల తగాదాల పరిష్కారం కోసం రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రీసర్వేలో ఎదురవుతున్న అభ్యంతరాలను వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పీజీఆర్ఎస్ దరఖాస్తులను ఎస్ఎల్ఏ గడువు దాటిపోకుండా పరిష్కరించాలన్నారు. అలాగే ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ఇంటి స్థలాల పట్టాల వెరిఫికేషన్, నీటి పన్ను వసూలు వంటి అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ సమీక్షలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యమెందుకు?

(ఐదో పేజీ తరువాయి)

యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ముఖలింగాపురంలో గిరిజనులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నకేదారి రిజర్వాయర్ నిర్మించి.. తమకు సాగునీరు అందించాలని గిరిజనులు కలెక్టర్‌ను కోరారు.

● అనంతరం మొఖలింగాపురంలో దుర్గగెడ్డ సమీపాన ఉన్న చెరువును పరిశీలించి చెక్‌డ్యామ్ నిర్మించాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. దుర్గగెడ్డలో పిచ్చిమొక్కలు, పూడికలతో పాటు ఆక్రమణలు తొలగించాలని స్పష్టం చేశారు. ఈ ప్రాంత గిరిజనులతో గ్రామసభ నిర్వహించి.. ఏఏ పనులు అవసరమో వారి ద్వారా గుర్తించాలని సూచించారు. ● గడిమెట్ట జగన్నాథపురంలో ఫాంపాండ్‌ను పరిశీలించి ఆ ప్రాంతంలో అటవీ భూముల వివరాలు, గ్రౌండ్‌వాటర్ పరిస్థితిపై ఆరాతీశారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో కన్వర్జెన్స్ ద్వారా ఆయా శాఖలతో ఏఏ పనులు చేపట్టాలో తెలుసుకున్నారు. గోశాల పరిస్థితులు, బిల్లులు చెల్లింపులపై ఆరాతీశారు. సోలార్ వాటర్‌ప్లాంట్ పాడై.. తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డ్వామా పీడీ సుధాకర్, వంశధార ఈఈ శేఖర్, పీఆర్ డీఈఈ సుధాకర్, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో లక్ష్మీబాయి, ఏపీవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ తింటే.. జబ్బులు గ్యారంటీ!

(ఐదో పేజీ తరువాయి)

అంటగడుతున్నారు. వీటిని తిన్న పలువురు అనారోగ్యానికి గురవుతున్నారు.

నిబంధనలు బేఖాతర్..

హోటల్స్ నిర్వహణ చేయాలంటే ముందుకు పంచాయతీ/ మునిసిపాలిటీ అధికారుల అనుమతులు పొందాలి. వినియోగదారులకు శుచి, రుచికరమైన పదార్థాలను పెడతామని లేదంటే అనుమతులు రద్దు చేయాలనే ఒప్పంద ప్రతాన్ని హోటళ్ల నిర్వాహకులు అధికారులకు సమర్పించాలి. ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారుల నుంచి కూడా అనుమతులు పొందాలి. హోటళ్లలో వేడినీటిని మాత్రమే అందజేయాలి. కానీ జిల్లాలో ఏ ఒక్కరూ ఇవేవీ పాటించడం లేదు. ఇష్టానుసారంగా మురికికాలువలపై టిఫిన్ దుకాణాలు ఏర్పాటు చేస్తూ.. నిల్వ పదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. చాలా హోటల్స్‌లో సాంబరు ఇడ్లీ రూ.50, ఇడ్లీ రూ.15, పూరీ రూ.30, దోస రూ.50, ఉల్లిదోస రూ.60, చపాతి రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక దాబాలు, పెద్ద హోటల్స్‌లో చికెన్‌తో ఏ కూర తీసుకున్నా.. రూ.220 నుంచి రూ.380 వరకు వసూలు చేస్తున్నారు. ధరలు నియంత్రించాల్సిన అధికారులు.. వారి దగ్గర మామ్మూళ్లు తీసుకుని చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ తనిఖీలు చేసినా.. మొక్కుబడిగానే సాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై ఆహార కల్తీనియంత్రణ అధికారి వెంకటరత్నం వద్ద ప్రస్తావించగా.. హోటళ్లు, దాబాల్లో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. డ్రైనేజీ మీద షాపులు, హోటల్స్‌కు తమ శాఖ అనుమతి ఇవ్వడం లేదని తెలిపారు. అనుమతి లేకుండా వ్యాపారాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.


స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న అర్చకులు

వైభవంగా ఆదిత్యుని రథోత్సవం

అరసవల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అరసవల్లి మాడ వీధుల్లో రథోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ఆలయ అనివెట్టి మండపంలో ఉంచి, సాయంకాల ఉపాసన హోమాదులు, మంగళ హారతి, కార్యక్రమాలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, షన్ముఖశర్మ, నేతింటి హరిబాబు, రంజిత్ శర్మ, రామకృష్ణశర్మ పాల్గొన్నారు. అలాగే స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆలయ అనివెట్టి మండపంలో సదస్యం, మహదాశీర్వచన కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వేద పండితులను సత్కరించారు.



షిర్డీ సాయిబాబా సన్నిధిలో భక్తులు

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

గార, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బూరవెల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, విశేష పుష్పాలంకరణ సేవ చేశారు. ఆ తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం బాబా వారి అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం బాబాకు పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వాహనాలకు తుప్పు... ఎవరిది తప్పు?

- పరిశుభ్రతా అంతంతే..
- కలెక్టరేట్ వద్దనే దారుణ పరిస్థితి


కలెక్టరేట్ వద్ద తుప్పుపట్టిన జీపు


మూలకు చేరిన వాహనాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనంతో కొనుగోలు చేసిన ప్రభుత్వ వాహనాలు మరమ్మతులకు గురైతే సంబంధిత కార్యాలయాల ఆవరణలోనే వదిలేస్తున్నారు. ఆ వాహనాలు ఎండకు ఎండి, వానకు తడిసి చివరకు తుప్పుపట్టి ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. మరమ్మతులకు గురైన తొలిదశలో ఎంతో కొంత వెచ్చిస్తే వినియోగానికి వీలుగా చేసుకోవచ్చు. కానీ మన అధికారులు దీనిపై దృష్టి పెట్టడం లేదు. ప్రజాధనం అంటే అధికారులకు చిన్న చూపు అయిపోయింది. అందుకు నిదర్శనమే స్థానిక కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పడి ఉన్న తుప్పుపట్టిన, పడుతున్న వాహనాలు. స్థానిక ఉద్యానవన శాఖ కార్యాలయం, ఖజానా శాఖ, డీఆర్డీఏ కార్యాలయాల వద్ద వివిధ వాహనాలు వృథాగా పడి ఉన్నాయి. ఇక ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిశుభ్రత పరిస్థితీ అలాగే ఉంటోంది. చెత్తాచెదారం తో కూడిన అపరిశుభ్ర వాతావరణం దర్శనమిస్తోంది. డీఆర్డీఏ కార్యాలయం ఎదుట పుట్టలు పెరిగిపోయి.. పరిసరాలు చెత్తతో నిండిపోయాయి. జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది నిత్యం విధులు నిర్వహించే చోట ఇటువంటి పరిస్థితులు ఉండడం దారుణమని ప్రజలు వాపోతున్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో ఒకవైపు ప్రభుత్వం పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తుంటే.. సాక్షాత్తూ కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ఇటువంటి అపరిశుభ్ర వాతావరణం ఉండడం గమనార్హం.


డీఆర్డీఏ కార్యాలయం వద్ద పెరిగిన పుట్టలు

కాలుష్య కోరల్లో గ్రామాలు

● పొలాల్లో పంట వ్యర్థాలకు నిప్పు

● ఇళ్లను చుట్టేస్తున్న పొగ

ఆమదాలవలస, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పొలాల్లో ఉన్న పంట వ్యర్థాలను కాలుస్తుండడంతో పలు గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయని ఏపీ ఎన్‌జీసీ జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు తమ పంట పొలాల్లో ఉన్న వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల అగ్నిజ్వాలలు చెలరేగి పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో విపరీతమైన కాలుష్యం వెదజల్లుతుందన్నారు. ముఖ్యంగా ఆమదాలవలస మండలం బెలమాం, లొద్దలపేట పరిసర గ్రామాల పొలాల్లో పంట వ్యర్థాలను విపరీతంగా కాలుస్తున్నారన్నారు. దీనివల్ల పర్యావరణానికి హాని కలగడమే కాకుండా రైతులకు కూడా నష్టం కలుగుతుందన్నారు. దీనివల్ల కలిగే నష్టాలపై సచివాలయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.



పొలాల్లో వ్యర్థాలను కాలుస్తున్న దృశ్యం

సంగీతంతో ఉద్దానానికే గుర్తింపు

కవిటి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సంగీతంతో గుర్తింపు పొందిన బి.సత్యవరప్రసాద్ ఉద్దానం ప్రాంతానికే వన్నెతెచ్చారని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. జగతి, కవిటి గ్రామాల్లో ఉగాది పురస్కారం పొందిన సత్యవరప్రసాద్‌ను గురువారం సత్కరించారు. కాశీలోని బెనారస్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉంటూ సంగీత ప్రపంచంలో మృదంగ విన్యాసాలు పలికిస్తున్న ప్రసాద్ మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.రాజేష్, పి.వెంకటేశ్వరరావు, పి.హరినారాయణ, పి.ప్రసాద్, పి.చంద్రశేఖర్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పొందూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విజయ నగరం పరిధి పూల్‌బాగ్‌లో ఉన్న బదిరుల పాఠశాలలో ఈ ఏడాదికి గాను బాలబాలికల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అధికారు లు, పాఠశాల ప్రిన్సిపాల్ బి.దయానంద్ కోరారు. పాఠశాలలో చేరేందుకు సదరం, పుట్టిన తేదీ, కుల ధ్రువ పత్రాలతోపాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలను దరఖాస్తుతో జత చేయాలన్నారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా సీవై చింతామణి జయంతి



చింతామణి చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ సంపాదకులు, రాజనీతిజ్ఞుడు, రచయిత చిర్రావూరి యజ్ఞేశ్వర (సీవై) చింతామణి జయంతిని నిర్వహించారు. చింతామణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జర్నలిజం, సామాజిక, రాజకీయ రంగాల్లో ఆయన చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో జర్నలిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ ఆర్.తిరుపతిరావు, డాక్టర్ జీఎల్‌వీ ప్రసాదరావు, డాక్టర్ వైడీ రామదాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

బూర్జ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సింగన్నపాలెం గ్రామంలో ఉపాధి నిధులతో చేపట్టిన డ్రైన్లు, రహదారులను పంచాయతీరాజ్ జేఈ మణికుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎక్కువ మొత్తంలో నిధులను వినియోగించి అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ గణేష్, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం తదితరులు ఉన్నారు.

నేడు ఓపెన్ ఫోరం

శ్రీకాకుళం అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఈ నెల 11న శుక్రవారం టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన విషయాలపై ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్టు కమిషనర్ పీవీవీ ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఓపెన్ ఫోరంలో పుర ప్రజలు, భవన నిర్మాణదారులు, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ హాజరుకావాలని కమిషనర్ కోరారు.

21న మోడల్ పరీక్ష

సోంపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించనున్న పరీక్ష ఈ నెల 20నుంచి 21వ తేదీకి మార్చినట్టు ప్రిన్సిపాల్ చిన్నాజీవర్మ తెలిపారు. 20న ఈస్టర్ ఉండడంతో 21వ తేదీకి మార్పు చేసినట్టు స్పష్టం చేశారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష ఉంటుందని, దీనిపై ఈనెల 16న అవగాహన కలిస్తామన్నారు.

● రణస్థలం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 21వ తేది ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరగనున్నదని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 20న జరగవల్సి ఉండగా ఈస్టర్ సందర్భంగా మార్పుచేయడం జరిగిందన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

జి.సిగడాం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. మంగమ్మపేట, దేవరవలస గ్రామాల్లో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బిడ్డకు ఆరు నెలలు వరకు తల్లిపాలుతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యవిద్యలో శ్రీకాకుళం విద్యార్థిని సత్తా



డాక్టర్ సాయిప్రియ

అరసవల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పట్టణం, బలగ ప్రాంతానికి చెందిన కింతలి సాయిప్రియ వైద్యవిద్యలో ప్రతిభ చూపారు. రేడియాలజీ ఎండీ కోర్సుకు సంబంధించి ఎన్టీఆర్ యూనివర్సిటీ ఇటీవల ప్రకటించిన తుది ఫలితాల్లో ఆమె రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈమె ఎంబీబీఎస్ కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో పూర్తి చేశారు. రేడియాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా స్థిరపడాలన్నదే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. సాయిప్రియ తండ్రి కింతలి కాళిదాసు వ్యాపారం చేస్తుండగా, తల్లి స్థానిక బలగ స్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయురాలు. చెల్లెలు అపర్ణ కూడా వైద్య విద్యను అభ్యసిస్తుంది.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి



ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్న కళాశాల సిబ్బంది

కంచిలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో తమ పిల్లలను చేర్పించాలని కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్ కోరారు. ఈసందర్భంగా సిబ్బందితో కలిసి ఆటోలో గ్రామాలకు వెళ్లి ప్రభుత్వ కళాశాల్లో చదువుకోవడం ద్వారా ఉచితంగా జేఈఈ, నీట్ సంబంధించిన స్టడీ మెటీరియల్ ఈ ఏడాది నుంచి అందిస్తామన్నారు. పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి, ప్రయోగశాలలు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్టు వివరించారు.

15 నుంచి సముద్రంలో చేపల వేటపై నిషేధం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపద పరిరక్షణ, ప్రభావవంతమైన నిర్వహణ కోసం ఏపీ తీరంలోని ప్రాదేశిక జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. సాంప్రదాయ పడవలు మినహాయించి, ఔట్ బోర్డ్, ఇన్ బోర్డ్ ఇంజన్లు అమర్చిన మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లతో ఈ 61 రోజుల పాటు తూర్పు తీర సముద్ర జలాల్లో మత్స్య సంపద వేటపై నిషేధం అమలులో ఉంటుందని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది.

సకాలంలో పథకాలు అందించాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన కులాలకు, షెడ్యూల్ కులాలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో ఆయన గురువారం శాఖల వారీగా సమీక్షించారు. రుణాల మంజూరు, వసతి గృహాల నిర్వహణ పూర్తిస్థాయిలో జరగాలన్నారు. అర్హులైన బీసీ, ఎస్సీలకు రుణాలు న్యాయంగా అందించాలని, వారు ఆర్థికంగా బలపడేలా కృషి చేయాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వసతి గృహాల నిర్వహణ జరగాలని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారులు, ఎస్సీ సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి విజన్-2047 ద్వారా ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారుకావాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. స్థానిక డీఆర్డీఏ కార్యాలయంలో మెప్మా అధికారులతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతాంగానికి, మత్స్యకారులకు చిన్న పరిశ్రమలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్డీఏ ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో పథకాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

హోమియో వైద్యానికి ఆద్యుడు హానిమన్



హానిమన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కవిటి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హోమియో వైద్యానికి ఆద్యుడు శ్యాముల్ హానిమన్ అని జగతిలో గల హోమియో ఆసుపత్రి వైద్యుడు దుర్గాప్రసాద్ పట్నాయక్ అన్నారు. జగతి గ్రామంలో గురువారం హానిమన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైద్యులు ఎన్.దాసు, పి.అనురాధ, జి.సుబ్బారెడ్డి, గోవింద్, మండల ఉపాధ్యక్షుడు పి.నేతాజీ, సర్పంచ్ పి.వరప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన పంచాయతీ కార్యదర్శులు

అరసవల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ సభ్యులు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఎమ్మెల్యే విని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెట్ట అమరనాథ్, కార్యదర్శి గొండు తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐపీ అమల్లో ఉత్తమ వర్సిటీగా బీఆర్ఏయూ



ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న బీఆర్ఏయూ సమన్వయకర్త అజయ్‌కుమార్

ఎచ్చెర్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంటు ప్రోగ్రాం (ఎల్ఐపీ) అమల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. విజయవాడలో రాష్ట్ర సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన యూనిసెఫ్- ఎల్ఐపీ ప్రాణమిత్రపై జరిగిన వర్క్‌షాపులో బీఆర్ఏయూ బీసీడీఈ సమన్వయకర్త డాక్టర్ బలగ అజయకుమార్‌ను అధికారులు సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు ఎల్ఐపీపై అవగాహన, సమావేశాల నిర్వహణలో బీఆర్ఏయూ ముందంజలో నిలవడంతో డాక్టర్ అజయ్‌కుమార్‌ను ఉత్తమ అధికారిగా గుర్తించి సత్కరించారు. రాష్ట్రంలో ఎల్ఐపీ అమలులో ఎంపికైన నాలుగు వర్సిటీల్లో బీఆర్ఏయూ ఒకటిగా నిలవడంపై వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత హర్షం వ్యక్తంచేశారు.


హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్, మాజీ మంత్రి శ్రవణ్ కుమార్

జి.సిగడాం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్), రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ మంత్రి శ్రవణ్‌కుమార్ అన్నారు. వాండ్రంగిలో రాష్ట్ర సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివానంద సరస్వతి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సీతారాముల కల్యాణ మండపాన్ని గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరిలో భక్తి భావం పెంపొందించుకోవాలని, అప్పుడే మనశ్శాంతి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ శతజయంతి కన్వీనర్, సాధుపరిషత్ గౌరవ అధ్యక్షుడు అట్లూరి నారాయణరావు, విశాఖ గాయిత్రిమాత, ఒంగోలు భైరవానందస్వామిజీ, కావలి త్యాగరాజు స్వామిజీ, మంగళగిరి దయానంద స్వామీజీ, ప్రకాశం శుభోదానంద, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైకత శిల్పం



ఆమదాలవలస, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సంగమేశ్వర కొండ సమీపాన గాజులకొల్లివలస గ్రామానికి చెందిన సైకత శిల్పి గేదెల హరికృష్ణ మహావీరుని జయంతి సందర్భంగా గురువారం మహావీరుడి సైకత శిల్పం రూపొందించారు. దీనిని చూసేందుకు పలువురు ఆసక్తి చూపారు.

జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



విజేతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆమదాలవలస, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస పతంజలి యోగా శిక్షణా కేంద్రం శిక్షకులు అప్పన్న, లగుడు లక్ష్మి ఈ నెల 6న జమ్ము కశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్‌లో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీలలో ప్రతిభ చూపారు. 50 ఏళ్ల వయసు పైబడిన వారిలో మహిళా విభాగం నుంచి లగుడు లక్ష్మి ద్వితీయ స్థానం సాధించారు. పురుషుల విభాగంలో అప్పన్న తృతీయ స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి వందలాది మంది పాల్గొనగా.. శ్రీకాకుళం జిల్లా వాసులు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించడం విశేషం. వీరిని జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి బొడ్డేపల్లి దక్షిణామూర్తి, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు అభినందించారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను గుర్తిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పెద్ద చెరువు ఆక్రమణల తొలగింపు చర్యలు అధికారులు చేపట్టారు. తహసీల్దార్ బలగ గోపాల్, రెవెన్యూ పరిశీలకులు జి.శ్రీనివాసరావు, జలవనరుల శాఖ ఏఈ కె.రాంబాబు గురువారం రైతుల సమక్షంలో సరిహద్దులను నిర్ధయించారు. చెరువులో గర్భంలో ఆక్రమణలను తొలగించేలా ఈ నెల 14వ తేదీ నుంచి ఉపాధి పనులు చేపడతామన్నారు.

తల్లిపాలే శ్రేయస్కరం

రణస్థలం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వారి ఊయల కార్యక్రమాన్ని గురువారం కొండములగాం సీహెచ్‌సీలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. పసి పిల్లలను వద్దనుకునేవారు ఊయలలో వేసి రక్షించాలన్నారు. కొంతమంది చెత్త కుండీలు, ముళ్ల పొదల్లో చిన్నారులను విడిచి పెడుతున్న ఘటనలు జరుగుతున్నాయని, అటువంటివారు ఈ ఊయలలో వేయాలని సూచించారు. అటువంటి పిల్లను శిశు సంక్షేమ శాఖ సంరక్షించి పిల్లల కోసం దరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసుపత్రిలో ఉన్న బాలింతలకు పోషక విలువలతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ కమిటీ సభ్యుడు దన్నాన స్వామినాయుడు, సీడీపీవో సీహెచ్ ఝాన్సీ, నాయకులు పిసిని జగన్నాథంనాయుడు, దన్నాన సత్తిబాబు, వెలిచేటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆగని మట్టి మాఫియా

● చోద్యం చూస్తున్న అధికారులు



పాలవలస పొలాల్లో తవ్వేస్తున్న మట్టి

సరుబుజ్జిలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టిమాఫియా చెలరేగిపోతుంది. సరుబుజ్జిలి, రొట్టవలస, పురుషోత్తపురం, పాలవలస గ్రామాల పరిధిలోని చెరువు గర్భాలు, పొలాలు నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుడా ఇష్టరాజ్యంగా మట్టి రవాణా చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా రవాణా చేయడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాలు, చెరువులు నుంచి జేసీబీల ద్వారా తవ్వకాలు చేపట్టిన మట్టిని సింగుపురం, తండేవలస, శిలగాం శింగివలస ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనుమతులు తీసుకోకుండా ఎలా రవాణా చేస్తున్నారని ప్రశ్నిస్తే.. అధికారులతో తాము ఒప్పందం చేసుకున్నామని, తమను ఎవరు అడ్డుకుంటారని ధీమాగా సమాధానమిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రణస్థలం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రణస్థలం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఈఈ పి.యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జేఆర్‌పురం, రణస్థలం, రావాడ, కొండము లగాం, కమ్మసిగడాం, వేలుపురాయి, దేవరాపల్లి, అర్జునవలస, ఎం.నగరప్పాలెం, సంచాం, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నానపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

● ఎచ్చెర్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): డి.మత్స్యలేశం, కుప్పిలి, పారిశ్రామిక ఫీడర్లలో 33/11 కేవీ, ఎచ్చెర్ల సబ్‌స్టేషన్ నిర్వహణ కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంత రాయం ఏర్పడుతుందని ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల, చిలకపా లెం, ఎస్ఎస్ఆర్‌పురం, ఫరీద్‌పేట, ఎస్ఎంపురం, జరజాం, డి.మత్స్యలేశం, భగీరథపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

● జి.సిగడాం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గెడ్డ కంచరాం, చెట్టుపొదిలాం ఫీడర్ల పరిధిలో 11కేవీ విద్యుత్ మరమ్మతు పనులు కారణంగా పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ పి.యోగేశ్వరరావు, ఏఈ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. జి.సిగడాం, బాతువ, గెడ్డకంచరాం, నడిమివలస, జాడ, నిద్దాం, అద్వానంపేట, ఎందువపేట, శేతుభీమవరం, గొబ్బూరు, మదుపాం, చెట్టుపొదిలాం, దేవర వలస, చంద్రయ్యపేట, వెలగాడ, ఎస్పీఆర్ పురం, మదుపాం, తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలగనుందన్నారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

ఆమదాలవలస, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అప్పగించవద్దని మునిసిపల్ యూనియన్ లీడర్ తాడి సంతోష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం విజయవాడలోని అలంకార్ సెంటర్ వద్ద ఉన్న ధర్నాచౌక్ వద్ద ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా చేపట్టిన సంతకాల సేకరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూనియన్ నాయకులు కె.తారకేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

చర్చిలో సీసీ కెమెరాల ఏర్పాటు

గార, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): జెల్లపేటలో ఉన్న చర్చిలో బుధవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ జనార్దనరావు తెలిపారు. ప్రార్థనా మందిరాల్లో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేస్తున్నామన్నారు. ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

బడులను బలోపేతం చేయండి

కంచిలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో తమ పిల్లలను చేర్పించాలని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ కోరారు. జలంత్రకోట పంచాయతీ చౌత్రాయిపురం, ఉప్పరిపేట, చిలకలమెట్ట, పోటుగుడ్డి తదితర గ్రామాల్లో ఉపాధి పనులు చేపడుతున్న వేతనదారులతో గురువారం సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం మడ్డు తిరుపతిరావు, సీఆర్ఎంటీ వజ్జ శేఖర్, యారాడి దీనబంధు, చల్లా లింగమూర్తి, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

వృత్తివిద్యలో నైపుణ్యం ఉండాలి

పొందూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు వృత్తి విద్యలో నైపుణ్యం తప్పనిసరి అని స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకరరావు తెలిపారు. పాఠశాలలో చదువుతున్న 9, 10, ఇంటర్ విద్యార్థుల వృత్తివిద్యలో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా టైలరింగ్, బొటిక్, మగ్గం వర్కులను విద్యార్థులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రాజశేఖర్, జీసీడీవో నారజాక్షి, బి.తిరుపతిరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పాసిగంగుపేటలో ఒకరి ఆత్మహత్య

పాతపట్నం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి):మండలంలోనిపాసిగంగుపేటలో మహమ్మద్ షఫి(29) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ షఫి మండలంలోని పాసిగంగుపేట గ్రామానికి చెందిన గురల్ల రాములమ్మను ఎనిమిదేళ్ల కిందట ప్రేమించి వివాహంచేసుకున్నాడు.వీరు విశాఖలో నివాసముంటుండేవారు. పిల్లలు కూడాలేరు.ఇటీవల విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లి సెంటరింగ్ పనులు చేసి జీవనం సాగిస్తున్నారు. హైదరాబాద్ నుంచి నాలుగురోజుల కిందట షఫి పాసిగంగుపేట వచ్చాడు. ఈనేపథ్యంలో సీది, పాసిగంగుపేటకు చెందిన యువకులు గురువారం సాయంత్రం వాకింగ్‌కు వెళ్తున్నారు. ఆ సమయంలో గ్రామ సమీపంలోని అప్పలమ్మతోటలో చెట్టుకు షఫి ఉరివేసుకొని వేలాడుతూ కనిపించడంతో సమాచారాన్ని పోలీసులకు అందజేశారు.ఎస్ఐ బి.లావణ్య ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు.కాగా శ్రీకాకుళంనుంచి క్లూస్‌టీము కూడా వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించింది.

చికిత్సపొందుతూ కార్మికుడి మృతి

టెక్కలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): టెక్కలి ఎన్టీఆర్ కాలనీకి చెందిన హోటల్ కార్మికుడు జామి మణి(26) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఇటీవల నందిగాం మండలంలోని కొత్తగ్రహారంసమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు.ఈనేపథ్యంలో మణి మృతితో తల్లిదండ్రులు జామి రమణయ్య, ఉషలు విలపిస్తున్నారు. మణి మృతిపై హోటల్ కార్మికులు సంతాపం తెలిపారు.ఈ మేరకు నందిగాం పోలీసులు కేసు నమోదుచేశారు.

నిందితుడికి ఏడాది జైలు

పొందూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతికి కారణమైన లారీ డ్రైవర్ కిల్లాన శ్రీనుకు ఏడాదిపాటు సాధారణ జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ పొందూరు కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న గురువారం తీర్పు చెప్పినట్టు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. 2019లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్ఐ వెల్లడించారు. మండల పరిధి కృష్ణాపురానికి చెందిన అంబల్ల సంతోష్ బైక్‌పై వస్తుండగా రెడ్డిపేట జంక్షన్ వద్దలారీతో కిల్లానశ్రీను ఢీకొట్టాడు. దీంతో సంతోష్ అక్కడికక్కడే మృతిచెందగా చీమల మణికంఠ గాయపడ్డాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ మహమ్మద్ యాసిన్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు తెలిపారు.

ఎల్‌సీగేట్‌ను ఢీకొన్న లగేజీ ఆటో

పలాస, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):కాశీబుగ్గ లెవల్ క్రాసింగ్ గేట్(ఎల్‌సీ)కు ఓ లగేజీ ఆటో గురువారం మధ్యాహ్నం ఢీకొంది. దీంతో గేటు విరిగిపోవడంతో ట్రాఫిక్‌కు గంటపాటు అంతరాయం కలడంతో కాశీబుగ్గ పోలీసులు ట్రాఫిక్ నియంత్రించారు. రైల్వే సిగ్నల్ సిబ్బంది చేరుకొని తాత్కాలిక గేటును అమర్చారు. సంఘటన స్థలానికి ఆర్‌పీఎఫ్ సిబ్బంది పరిశీలించి, ప్రమాదానికి కారణమైన ఆటోపై కేసు నమోదుచేశారు.

టెక్కలి డీఎస్పీగా భార్గవి

టెక్కలి,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):టెక్కలి డీఎస్పీగా ఎస్.భార్గవిని నియమిస్తూ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేసిన వీఎస్ఎన్ మూర్తి మార్చి 31న పదవీ విరమణ చేయడంతో ఎస్.భార్గవిని టెక్కలి డీఎస్పీగా నియమించారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు: సీఐ

హరిపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):మహిళల రక్షణకోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చిందని, వీటిపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని సీఐ తిరుపతిరావు తెలిపారు. గురువారం మందసలోని బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ఫోక్సో,గృహహింస చట్టాలు, శక్తియాప్ గురించి వివరించారు.కార్యక్రమంలో ఎస్ఐ కె. కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం తిరస్కరణ

నరసన్నపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):నరసన్నపేట ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబుపై వైసీపీకి చెందిన వార్డు సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఆర్డీవో సాయిప్రత్యూష తిరస్కరించారు. పంచాయతీరాజ్ చట్టం-1992 ఉన్న నిబంధనలు విరుద్ధంగాఉండడంతో తీర్మానం తోసివుచ్చారని కృష్ణబాబు గురువారం ఒకప్రకటనలో తెలిపారు. గత ఎన్నికల సమయంలో కృష్ణబాబు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈనేపథ్యంలో ఆయనపై గత నెల 25న వార్డు సభ్యులు ఆర్డీవోకు ఫిర్యాదుచేసిన విషయం విదితమే.

కిడ్నీ వ్యాధితో ఒకరి మృతి

టెక్కలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సన్యాసినీలాపురానికి చెందిన బెహరా సింహాద్రి(45)బుధవారం కిడ్నీ వ్యాధితో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సుమారు ఏడాదిగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ అస్వస్థతకు గురై మృతిచెందారు.

దేవాది మాజీ సర్పంచ్..

నరసన్నపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): టీడీపీనాయకుడు, దేవాది మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు గురువారం మృతిచెందారు. ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు.దేవాది సర్పంచ్‌గా రెండుసార్లు పనిచేశారు. లక్ష్మణరావు మృతిపై ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తీవ్ర సంతాపం తెలిపారు.

అంబీరుపేట కాలనీలో పరిశీలన

పోలాకి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):చెల్లాయివలస పంచాయతీ పరిధిలోగల అంబీరుపేట కాలనీలోగతంలో ఇందిరమ్మ పేరుతో పంపిణీచేసిన ఇళ్ల శిథిలావస్థకు చేరడంతో తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్ గురువారం రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఇక్కడ గతంలో 40 పూరిళ్ల మంజూరుచేశారు. దివంగత కేంద్ర మాజీమంత్రి ఎర్రంనాయుడు పూరిళ్ల స్థానంలో రేకిళ్లు నిర్మించుకునేందుకు నిధులు మంజూరుచేయించిన విషయం విదితమే. ఈనేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ఇళ్ల శిథిలావస్థకు చేరుకోవడంపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

నేడు ప్రకృతి వైపరీత్యాలపై మాక్‌డ్రిల్

రణస్థలం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో రక్షణ పొందేందుకు రాష్ట్ర విపత్తుల నిర్వహణసంస్థ ఆధ్వర్యంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై జీరుపాలెంలోశుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎన్.ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లాస్థాయిలో అన్ని శాఖల అధికారులు హాజరుకానున్నారని తెలిపారు.

భీష్ముని బోధనలు ఆచరణీయం

చిత్ర

పర్లాకిమిడి, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి):మహాభారతంలో భీష్మపర్వం అనుసరణీయమైనదని, భీష్ముడు బోధనలు ఆచరణీయమని సామవేదం షణ్ముఖ శర్మ ఆచార్యులు తెలిపారు. గజపతి జిల్లా కాశీనగర్ సమితి రాణిపేటలో మూడురోజులుగా మహాభారతంలో భీష్మాచార్యుని బోధనఅన్న అంశంపై ప్రవచనాలను నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా షణ్ముఖ శర్మ మాట్లాడుతూ దాయాదుల పోరులో నలిగిన భీష్ముడు న్యాయం, ధర్మాన్ని ఆచరించి పాండవులను బలపరిచాడని,కాని విధిఆయన్ను కౌరవుల వైపు ఉండేలా చేసిందని తెలిపారు. అనంతరం రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రామరాజు షణ్ముఖ శర్మను సన్మానించారు.

ఆధ్యాత్మిక ప్రవచనాలతో ఆనందం

ఆధ్యాత్మిక ప్రవచనాలతో ఆనందం లభిస్తుందని పండితుడు సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. గురువారం పర్లాకిమిడిలో దక్షిణభారత బ్రాహ్మణసేవా సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయసత్కారంకార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పర్లాకిమిడితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు వేదం రమణమూర్తి, వెల్లంకి కూర్మనాథం, కార్యదర్శి గడిమెట్ల శ్రీను, భాస్కరభట్ల రవి, చట్టి వెంకటేశ్వరరావు, డాక్టర్ రామలక్ష్మి, మరువడా శివరామకృష్ణ పాల్గొన్నారు.

నిర్వహణ లేక..నిర్వాసితులకు నీరందక

●కుప్పిలి చెరువు వద్ద దెబ్బతిన్న పైపులైన్ ●మెగా డ్రింకింగ్ వాటర్ స్కీం నుంచి నిలిచిపోయిన నీటి సరఫరా

కొత్తూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పైపులైన్ల నిర్వహణ లేకపోవడంతో వంశధార నిర్వాసిత కాలనీలకు మూడు నెలలుగా నీరందడంలేదు. ప్రధానంగా పారాపురం దాటిన తర్వాత కుప్పిలి చెరువు వద్ద పైపులైన్ దెబ్బతినడంతో మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో మెగా డ్రింకింగ్ స్కీమ్ నుంచి గూనబద్ర ఆర్ఆర్‌కాలనీ, మెట్టూరు, మెట్టూరు బిట్-1, బిట్-2 పంచాయతీలకు నీటిసరఫరా నిలిచిపోయింది.

ఇదీ పరిస్థితి

కొత్తూరు మండలంలోని వసప వద్ద వంశధార నదిలో నుంచి పంపింగ్ చేసి కొత్తూరు, సీతంపేట మండలాలకు నీటి సరఫరా చేయాలన్న ఉద్దేశంతో మెగా డ్రింకింగ్ స్కీమ్‌ని ఏర్పాటు చేశారు. అయితే 2009లో వంశధార ప్రాజెక్టు నిర్వాసితగ్రామాలు గూనబద్ర ఆర్ఆర్‌కాలనీ, మెట్టూరు, మెట్టూరు బిట్-1, బిట్-2 పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. దీంతో ఈ నిర్వాసిత గ్రామాలకు మెగా డ్రింకింగ్ స్కీమ్‌ని అనుసంధానంచేశారు.కాగాకుప్పిలి చెరువువద్ద పైపులైన్ దెబ్బతినడంతో మూడునెలలు నుంచి మెట్టూరు, మెట్టూరు బిట్-1, బిట్-2 పంచాయతీలకు స్కీమ్ ద్వారా నీటి సరఫరా నిలిచిపోయిందిదీంతో నిర్వాసితగ్రామాలప్రజలు స్థానికంగా అందుబాటులో ఉన్న బోర్లనీటిని వినియోగిస్తున్నారు. కొందరు ఆర్థికంగాఉన్న వారు ఇళ్లల్లో సొంతంగా బోర్లు ఏర్పాటుచేసుకున్నారు. ఆసరాలేని వారంతా మెగా డ్రింకింగ్ స్కీమ్ ఎప్పుడు మరమ్మతులుచేసి వినియోగంలోకి తీసుకువస్తారని ఎదురుచూస్తున్నారు. పారాపురం పంపు హౌస్ నుంచి నీటిని విడిచిపెడితే మెట్టూరు, మెట్టూరు బిట్-1, బిట్-2 పంచాయతీలు స్థానికంగా పంపు ఆపరేటర్లను నియమిస్తేనీటిని ట్యాంకులకు ఎక్కించి నిత్యం సరఫరాచేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చెబుతున్నారు. అయితే మెగా డ్రింకింగ్ వాటర్ స్కీం ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీఅధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతోనే నీటి సరఫరా నిలిచిపోయిందని నిర్వాసిత గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వంశధార ప్రాజెక్టుకు తమ భూములు, ఇళ్ల సర్వస్వం ధారపోసిన తమకు కాలనీల్లో మెరుగైన సేవలందిస్తామని చెప్పిన అధికారులు కనీసం తాగునీరందించడంలేదని వారంతా ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



నీరు రాక బిట్-1 వద్ద నిరుపయోగంగా ఉన్న కుళాయి

హెల్పర్లను నియమిస్తే నీటి సరఫరాకు చర్యలు

వంశధార నదిలో నీటి వనరులు తక్కువగా ఉండడంతో చివర గ్రామాలకు నీరందడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటప్పల నాయుడు తెలిపారు. మూడు నెలలుగా నిర్వాసిత గ్రామాలకు నీరు సరఫరా కావడంలేదని తన దృష్టికి వచ్చిందని చెప్పారు. శివారు పంచాయతీల్లో పంపు హెల్పర్లను పంచాయతీలు నియమించకపోవంతో తాగునీటి సరఫరా జరగడంలేదని తెలిపారు. పంచాయతీలు పంపు హెల్పర్లను నియమిస్తే పారాపురం నుంచి నిర్వాసిత కాలనీలకు నీటిని సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పర్యవేక్షణ లేక.. ఆక్రమణలు తొలగించక

● నిత్యం రోడ్డుపైకి చేరుతున్న మురుగునీరు
● నరసన్నపేట ప్రధాన రహదారిలో అగచాట్లు



పాతబస్టాండ్‌లో ప్రధానరహదారి వద్ద మురుగునీరు

నరసన్నపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలో ప్రధాన రహదారికి ఇరువైపు ఉన్న కాలువల ఆక్రమణ పుణ్యమాని మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలకు గురవుతున్నారు. ఇక్కడ మురుగు కాలువల నిర్వహణపై పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకుండాపోవడంతో ఆక్రమణలకు గురయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలనరసన్నపేట వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతోంది.అలాగే జనాభా క్రమేణా పెరుగుతోంది. ప్రస్తుతం 85 వీధుల్లో 30 వేలకుపైగా జనాభా నివసిస్తోంది. విద్య, వ్యాపారాలతోపాటు పలు అవసరాలకు పాతపట్నం, సారవకోట, జలుమూరు, పోలాకి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తదితర మండలాల నుంచి నిత్యం వస్తుండడంతో రద్దీ పెరుగుతోంది. ఈనేపథ్యంలో నిత్యం రద్దీగాఉండే ప్రధాన రహదారికి ఆనుకుని ఉండే జమ్ము జంక్షన్ నుంచి సత్యవరం 2.4 కిలోమీటర్ల కాలువలు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. పాతబస్టాండ్‌లో పల్లిపేట జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్ వరకు డ్రైనేజీపై అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఇళ్ల, షాపుల్లో నుంచి మురుగు నీరు వెళ్లేందుకుమార్గం లేకపోవడంతో రోడ్డుపైన ప్రవహిస్తోంది.మురుగు నీటి వల్ల నిత్యం దుర్వాసనతో అవస్థలు గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. దీనికితోడు ఏపాటి వర్షంకురిసినా కాలువలు లేకపోవడంతో మురుగుతోపాటు వర్షం నీరు రోడ్డుపైకి చేరి చెరువును తలపిస్తోంది. డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగించి సమర్థంగా మురుగునీటి వ్యవస్థను నిర్వహించాల్సిన పంచాయతీ యంత్రాంగం చోద్యంచూస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.కాగా రోడ్డుపైకి మురుగునీరు వెళ్లేకుండా చర్యలు చేపడతామని ఈవో ద్రాక్షాయిణి తెలిపారు.

ఉద్యోగావకాశాల కల్పనకు ప్రాధాన్యం

●పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం,ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగా వకాశాలు కల్పించేందుకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్థానిక ఎమ్మెల్యే మామిడిగోవిందరావు తెలిపారు. గురువారం పాతపట్నంలోని ప్రభుత్వఆదర్శ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో మెళియాపుట్టిలో పారిశ్రామిక హబ్‌ను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్ మెంట్ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ మాట్లాడుతూ 15 ప్రైవేటుసంస్థలు ఉద్యోగ అవకాశా లిచ్చేందుకు ముందు కువచ్చాచని, 456మందిఇంటర్వ్యూలకు హాజరుకాగా 201 మంది వివిధకంపెనీలకుఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో యువజన సంక్షేమాధికారి ప్రసాదరావు, ఎన్‌కేవై కోఆర్డినేటర్ వెంకట ఉజ్వల్, ఉపాధికల్పన జిల్లా అధికారి సుధారాణి, పర్యాటక శాఖాధికారి నారాయణరావు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కణితి శ్రీరాములు పాల్గొన్నారు. కాగా పాతపట్నంలో పీఎంజే వసతిగృహ నిర్మాణానికి స్థలాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం పరిశీలించారు. రూ.2.30కోట్లతో ప్రధానమంత్రి జన్‌మన్ వసతిగృహన్ని నిర్మించనున్నారు.



మాట్లాడుతున్న మామిడి గోవిందరావు

మెటర్నటీ వార్డుకు నిధులు ఇవ్వండి

●నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట సామాజిక ఆసుపత్రి మెటర్నటీ వార్డు పనులు పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు.ఈ మేరకు అమరావతిలోని సీఎంవో కార్యాలయంలో సీఎం నారా చంద్రబాబునాయుడును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగాక్రీడా వికాస కేంద్రం పనులు పూర్తి చేసి విద్యుదీకరణ చేపట్టాలని, రాజులు చెరువును పర్యాటక కేంద్రంగా మార్చడానికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈమేరకు చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని, ఆసుపత్రి భవన నిర్మాణాలు పూర్తిచేసేందుకు నిధులు మంజూరుకు హామీఇచ్చారని రమణమూర్తి తెలిపారు.



చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న బగ్గు రమణమూర్తి

అందర్నీ పిలిచారు.. ఆలస్యంగా ప్రారంభించారు


● కొత్తూరులో ట్రైసైకిళ్ల పంపిణీలో దివ్యాంగులు, తల్లిదండ్రుల అగచాట్లు

కొత్తూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కొత్తూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం ట్రైసైకిళ్ల పంపిణీలో దివ్యాంగులు అగచాట్లకు గురయ్యారు. కేవలం లబ్ధిదారులనే కాకుండా దివ్యాంగులందరినీ పిలిపించి, కార్యక్రమం సుమారు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభించారు. ఇక్కడ తొమ్మిది మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పంపిణీ చేశారు. భవిత కేంద్రం, మండల విద్యాశాఖ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం ఆలస్యంగా ప్రారంభంకావడంతో తల్లిదండ్రులతో పాటు వచ్చిన దివ్యాంగులు ఎండతీవ్రతకు అవస్థలకు గురయ్యారు. టెంట్ల కింద వేడిగాలులకు తట్టుకోలేక చెట్లకింద, భవనాల కిందకు వెళ్లాల్సివచ్చింది. ట్రైసైకిళ్ల మంజూరైన వారిని పిలిపించి అందజేస్తే సరిపోతుందని, అధికారులు దివ్యాంగులందరినీ పిలిపించి ఇబ్బందులుపాలుచేశారని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. కాగా భవితసిబ్బంది తమతో సమాలోచన చేయకుండా ట్రైసైకిళ్ల మంజూరైన పిల్లను తెప్పించి మిగిలిన వారిని పిలవకుండా ఉండిఉంటే బాగుండేదని ఎంఈవో గోవిందరావు తెలిపారు.ఎండ తీవ్రతకు దివ్యాంగులు ఇబ్బందులకు గురవడం వాస్తవమేనని చెప్పారు.కార్యక్రమంలో ఎంఈవో గోవిందరావు, టీడీపీ నాయకులు అగతముడి అరుణకుమార్, లక్ష్మణరావు, పెద్దిన అమర్, లక్ష్మీనారాయణనాయుడు, టొంపల తిరుపతిరావు పాల్గొన్నారు.



ఎండ వేడికి తాళలేక ఓ భవనంలో సేదదీరుతున్న దివ్యాంగులు, తల్లిదండ్రులు

ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

పలాస, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ ఉద్యోగులకు భద్రత కల్పించాలని ఎన్‌ఎంయూ నాయకులు డిమాండ్ చేశారు.గురువారం పలాసడిపో కార్యాలయంఆవరణలో ఆ సంఘ నాయకులు పి.వాలి, డీఎల్.నారాయణ, ఏవీరావు,టీడీరావు,టి.పార్వతీశం, ఎస్.నారాయణ, వై.అయ్యప్ప ధర్నా నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల భద్రత కల్పించే సర్క్యులర్ 1/2019ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతులు కల్పించాలని, గ్యారేజీ ఉద్యోగులకు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

టెక్కలిలో వేంకటేశ్వరాలయ వార్షికోత్సవం

టెక్కలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి):టెక్కలిలోని పట్టుమహాదేవి కోనేరు గట్టుపై గల వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారంవార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రత్యేకపూజలు, సాంస్కృతిక, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.



టెక్కలి: వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

షిర్డీసాయి ఆలయం..

జలుమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) జలుమూరులోని షిర్డీ సాయిబాబా ఆలయ 13వ వార్షికోత్సవం పురస్కరించుకుని గురువారం స్వామివారికి అర్చకులు వసనాభి శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని జలుమూరుతో పాటు వెంకటాపురం, తమ్మయ్యపేట, రామచంద్రాపురం గ్రామస్థులు దర్శించుకున్నారు.

బంగారమ్మతల్లి ఆలయం ప్రారంభం

పాతపట్నం ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొరసవాడలో బంగారమ్మతల్లి ఆలయం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐదురోజుల పాటు వేదపండితులతో ఆలయకమిటీపర్యవేక్షణలో ప్రతిష్ఠామహోత్సవం జరగనుంది.

బుసలు కొడుతూ.. భయపెడుతూ

● భోగాపురంలో పాము హల్‌చల్

హరిపురం ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని భోగాపురంలో బుధవారం రాత్రి కింగ్‌కోబ్రా ఓ ఇంట్లోకి దూరి హల్‌చల్ చేసింది. సుమారు 12 అడుగుల పొడవుతో ఉన్న సర్పాన్ని గ్రామస్థులు చూసి ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.బుసలు కొడుతూ ఉన్న పామును ఇంట్లోనే తలుపులు వేసి ఎటూ పోకుండా చర్యలు తీసుకున్నారు.కొర్లాంకు చెందిన స్నేక్‌స్నాచర్ నర్సింగ్ మహాపాత్రోకు సమాచారం అందించడంతో ఆయన హుటాహుటిన చేరుకొని కింగ్‌కోబ్రాను పట్టుకున్నాడు.అనంతరం సమీపంలోని కొండల్లోకి విడిచిపెట్టడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.



పామును పట్టుకున్న స్నేక్‌స్నాచర్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలి

కోటబొమ్మాళి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి):మౌలిక వసతులు, అర్హతగల ఉపాధ్యాయులు ఉన్న ప్రభుత్వపాఠశాల్లోనే పిల్లలను చదివించాలని పలువురు కోరారు. గురువారం తిలారు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ప్రభుత్వపాఠశాలలో అడ్మిషన్లు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తర్రరామకృష్ణ, హెచ్‌ఎం ఆర్‌ఎస్‌నాయుడు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే బాలలను..

నరసన్నపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే బాలలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవోలు ఉప్పాడశాంతారావు, పి.దాలినాయుడులు సూచించారు. గురువారం చెన్నాపురంలో ఎన్‌రోల్‌మెంట్‌పై ఇంటింటా బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ధర్మాన శంకరనారాయణ, ఉపాధ్యాయులు, సీఎంఆర్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ రికవరీలు చెల్లించాలి

మెళియాపుట్టి, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి):సోషల్ ఆడిట్ తనిఖీల్లో గుర్తించి రికవరీలు సిబ్బంది చెల్లించాలని జిల్లా విజిలెన్స్ అధికారి స్వరూపరాణి ఆదేశించారు. గురువారం మెళియాపుట్టి ఉపాధిహామీ పథకం కార్యాలయంలో గతంలో జరిగిన సామాజిక తనిఖీల్లో గుర్తించి అభియోగాల దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులకు సంబంధించి రికవరీలు సిబ్బంది వెంటనే చెల్లించాలనికోరారు. అనంతరం మండలంలో జరుగుతున్న ఉపాధిపనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహప్రసాద్, ఏపీవో రవి,ఈసీ ఆదినారాయణ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

రెండుపూటల పాఠశాల నిర్వహణపై నిరసన

టెక్కలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): టెక్కలి రోటరీనగర్ సమీపంలో ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వేసవిలో రెండుపూటలా తరగతులు నిర్వహిస్తుండడంపై విద్యార్థి సంఘాల నాయకులు గురువారం నిరసన తెలిపారు.ఈ మేరకు పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు విద్యాశాఖ అధికారులను కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాడివలస ఏపీజీవీబీ మేనేజర్ టి.అంకాల్ కోరారు. గురువారం బెలమాంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చిగురుపల్లి వెంకటేష్,ఎ.హరనాథ్, రవిబాబు,వి.పావని పాల్గొన్నారు.

నేడు బందరువానిపేటలో పల్లెనిద్ర

గార, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బందరువానిపేటలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే గొండు శంకర్ పల్లెనిద్ర చేపట్టనున్నట్టు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.సాయంత్రం నాలుగు నుంచి శనివారం ఉదయం పది గంటల వరకు జరిగే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కానున్నట్టు పేర్కొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

ఎచ్చెర్ల,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కొయ్యాం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సనపల షణ్ముఖరావు, నడిమింటి ధర్మారావు పాల్గొన్నారు.

వృత్తివిద్యలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఎచ్చెర్ల, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ బి.లక్ష్మి కోరారు.గురువారం కళాశాలలోనిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ 9, 10 తరగతులు, ఇంటర్ విద్యార్థులకు వృత్తివిద్యలో భాగంగా బ్యూటీ అండ్ వెల్‌నెస్ కోర్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బి.రాజశేఖర్,నీరజాక్షి, తిరుపతిరావు, తమ్మినేని నాగమణి పాల్గొన్నారు.

15న 'పైల' వర్ధంతి సభ

నరసన్నపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పలాసలో శ్రీకాకుళం గిరిజన సాయిధ రైతాంగ పోరాట విప్లవ యోధుడు పైలా వాసుదేవరావు 15వ వర్ధంతి సభ ఈనెల 15న నిర్వహించనున్నట్లు సీపీఐ న్యూడెమొక్రసీ నాయకుడు నేతింటి నీలంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హాజరుకావాలని కోరారు.

23,24 తేదీల్లో సాహిత్య పోటీలు

టెక్కలి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 23, 24 తేదీల్లో జాతీయస్థాయి సాహిత్య పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జాతీయస్థాయి లిట్ ఫెస్ట్ గోడపత్రికను కళాశాలలో ఆవిష్కరించారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

పాతపట్నం, ఏప్రిల్10(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని ఏపీ ఆదర్శపాఠశాలలో ఆరో తరగతిలోకి ప్రవేశానికి ఈనెల 20న ఆదివారం జరగాల్సిన ప్రవేశపరీక్ష 21వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి తెలిపారు. ఈ మేరకు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

పోషణ పక్వాడపై అవగాహన

పాతపట్నం, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి): తల్లీ బిడ్డల ఆరోగ్యపరిరక్షణలో పౌష్టికాహారం కీలకపాత్ర పోషిస్తుందని తెంబూరు హోమియో వైద్యాధికారి ఎస్.ఉమాగౌరి తెలిపారు. గురువారం పెద్ద లక్ష్మీపురంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా పోషణ పక్వాడపై అవగాహన సదస్సును నిర్వహించారు.

ఆశీలు వేలం పాట ఖరారు

జలుమూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగం మార్కెట్ ఆశీలు వేలంపాట 4.34 లక్షలకు ఖరారైనట్లు ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు తెలిపారు. శ్రీముఖలింగం గ్రామ సచివాలయంలో గురువారం సర్పంచ్ తమ్మన్నగారి సతీష్ అధ్యక్షతన నిర్వహించిన వేలంపాటలో 18 మంది వరకు పాటదారులు పాల్గొన్నారు. ఈమేరకు అదే గ్రామానికి చెందిన సోమలాపురి వెంకటేష్ అత్యధికంగా 4.34 లక్షలకు పాడి దక్కించుకున్నారు.గత ఏడాది వేలంపాట 3.20 లక్షలు కాగా ఈ ఏడాది 4.34 లక్షలకు పాట పాడినట్లు ఈవోపీఆర్డీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కరుకోల హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గోవిందరావు పాల్గొన్నారు.



శ్రీముఖలింగం గ్రామ సచివాలయంలో మార్కెట్ వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు